బాదం హల్వా

"ఈవేళ మంచిరోజేనా?"

"ఏ సరిహద్దుల్లో అల్లర్లు జరుగుతున్నాయి. మంచి పని చెయ్యడానికి అన్ని రోజులూ మంచివే. నీ లెక్కలో మంచి రోజునే పని చెయ్యాలంటే నీకు వారంలో ఆరురోజులూ రెస్టే!"

"పోన్లెండి! మరీ మంచిది. ఆ మంచిరోజు కాస్తా ఆదివారం ఐతే, నేను హాయిగా పూర్తి విశ్రాంతి తీసుకోవచ్చు. ఐనా, అడిగిన దానికి ఎదురు ప్రశ్నలేయకుండా సమాధానం చెప్పలేరా?"

"పూర్తి ఇన్ఫర్మేషన్ లేకుండా సలహాలిస్తే నీకు డొంక దారే. ఇంతకీ ఏమిటి పని?"

"నేను మన బ్యాంకు హెడ్డాఫీసుకి వెళ్లాలి. మనం అడిగిన లోన్ ప్రపోజల్ పైకి పంపారట. కాస్త మంచి టైం చూసుకుని వెడితే ఆ ఆఫీసరు పెద్దమనిషి ఏ బోర్డ్ మీటింగుకో వెళ్లకుండా సీట్లో ఉంటాడు. మనకి లోను వచ్చేదో చచ్చేదో ఈవేళే తేలిపోతుంది. ఎనిమిది నెలల తపస్సుకి ఒక ఫలితం కనపిస్తుంది."

"తొమ్మిది సంఖ్య ఐతే బావుండేది. ఐనా వీళ్ళు పంపారా? పంపుతున్నామన్నారా? రెండిటికీ చాలా తేడా ఉంది."

"నాతో ఐతే పంపామనే చెప్పారు. కానీ, నిన్న రాజు బ్యాంకికెడితే తయారౌతోంది పంపేస్తున్నామన్నారట!"

"సరిగ్గా కనుక్కునివెళ్లు. నీకసలే బీపీ. ఎండలెక్కువౌతున్నాయి. ఆపై బ్యాంకుతో వ్యవహారం! జాగ్రత్త!"

"ఎందుకన్ని జాగ్రత్తలు చెబుతారు? నేనేదో యుద్ధానికెడుతున్నట్లు! నాకేమైనా అందరితో గొడవలు పెట్టుకోవడం సరదానా? అర్థం పర్థం లేకుండా వాళ్లు మాట్లాడితే నేను మాత్రం ఎంతకాలం మంచిగా నిమ్మళంగా ఉండాలి. రెడ్డొచ్చె, మొదలాడరా! అన్నట్టుగా మరి వాళ్లకి చెప్పిందే చెప్పి, అడిగిందే, అడిగి ఉన్న మతి కాస్తా పోతోంది. మళ్ళీ నాకు ఉన్న మతిపోతే వాళ్లకేగా నష్టం. ఐనా, నేనెటూ మన బ్రాంచికి వెళ్ళాలి. నిన్న ఒక లక్షకి బ్యాంకు గ్యారంటీ ఇవ్వాలని ఢిల్లీనుంచి టెలిగ్రాం వచ్చింది. సోమవారంనాటికి వాళ్లకందాలట. కాబట్టి ఆ పనయ్యాకే నేను హెడ్డాఫీసుకెళ్లేది!"

ముందు బ్రాంచి కెళ్లాలని తయారౌతున్నా. అంటే - "మాకు తమరు శాంక్షన్ చేసిన లిమిట్స్‌లో పని చేయాలంటే ప్రాణం మీదకొస్తోంది. మా ఎఫిషియన్సీ లెవల్ 40శాతం కూడా దాటటం లేదు. కాస్త పెంచండి పెద్దలారా!" అని ఆరుసార్లుగా మేం చేసుకున్న విన్నపాల నిజప్రతులూ, అనుకున్న ప్రకారం అందుకోలేక పోయిన టర్నోవర్ల వివరాలూ, దానికి మేమిచ్చుకున్న వినయపూర్వక క్షమాపణ సమాధానాలూ, మేం తెచ్చుకోబోయే ఆర్డర్ని సజావుగా చేస్తే మా యూనిట్ గడించబోయే లాభాల ఊహా గణితాలూ, వగైరాలన్నీ సర్దుకునేప్పటికి పన్నెం డైంది. ఐన ఆలస్యం ఎలాగూ ఐందీ, భోజనం చేసేసి బయల్దేరితే నీరస మూ, ఆవేశమూ రెండూ కంట్రోల్లో ఉంటాయని ఆ పని కూడా కానిచ్చేశా.

"రాజూ, గోవిందుని కారు తీయమని చెప్పు!"

"ఆరు లంచి చేత్తన్నారండి."

వెళ్లబోయే పనికి రిజల్టు ఇక్కడే తెలిసిపోతోంది. "రాజూ, నువ్వు మన బ్రాంచి కెళ్లి అక్కడే ఉండు. నే వెనకాలే వస్తా. గోల్డ్ లోను ఆఫీసరుగారు వచ్చారో లేదో చూడు."

"అమ్మా! మీరొచ్చేలోపల మనం రాసుంచుకున్నా ఉత్తరం కానీ మన ఫీల్డాఫీసరుగారికిచ్చినామ్మా?"

"అలాటి ఉపకారాలేవీ నువ్వు చెయ్యక్కర్లేదు కానీ, మన ఎకౌంటు పొజిషను మాత్రం కౌంటర్లో చూసి అక్కడే ఉండు. ఆఫీసరుగారికి కనపడొద్దసలు, విషయం ఎత్తకు!"

రాజెళ్ళి పోయాడు.

మా డ్రైవర్‌గారి భోజనం అయి నేను బ్రాంచి చేరుకునేప్పటికి ఒంటిగంటైంది!

మా ఆఫీసరు కంప్యూటరు ముందు కూచుని ఏదో దీర్ఘాలోచనలో ఉన్నారు. ఎవరికొంప మునుగు తుందో?

"ఏంటి మేడం మీరొచ్చారు. రాజు రాలేదా?"

"అతనూ వచ్చాడు. నిన్న టెలిగ్రాం వచ్చింది. సోమవారం లోపల లక్షకి బ్యాంక్ గ్యారంటీ కట్టాలని. మీకు తెలుసుగా మాదే లోయెస్ట్ టెండర్. బ్యాంక్ గారంటీలకన్నిటికీ 25శాతం మార్జిను కట్టాలిగా. మాకేమో డ్రాయింగ్ పవర్ 7వేలే ఉంది. అందుకని కొద్దిగా గోల్డ్ తెచ్చా.! దానిమీద 25వేలు లోనిచ్చి అది మార్జినుగా పెట్టుకుని గారంటీ ఇవ్వమని అడుగుదామని వచ్చా.. రేపటికైనా గారంటీ రిలీజైతే స్పీడ్ పోస్ట్‌లో పంపిస్తాం!"

"ఇంత పనీ ఒక్కరోజులో అవడం కష్టం మేడం. పైగా గోల్డ్ లోను టైమైపోయింది. ఉండండి. సి.ఎమ్. గారిని అడిగి వస్తా!"

పావుగంటకి బయటకి వచ్చారు. అటెటో చూస్తూ నాకు చెప్పాడు. "మీకు గారంటీ లిమిటెప్పుడూ

శాంక్షనవ లేదుట గదా! అందుకని లక్షకి గారంటీ మేం ఇవ్వాలంటే మీరు లక్ష డిపాజిట్ చేయాలంటున్నారు మేనేజర్‌గారు!" మళ్లీ కంప్యూటర్ తపస్సులో పడ్డారు.

చేతనైనంతగా నవ్వు ముఖం పెట్టుకుని ఆయన రూంలోకి గేట్ క్రాష్ చేశా. కార్డు పంపితే పనవదని నాకు తెలుసు. మా సి.ఎం.గారు ఆరుగురు పెద్ద కష్టమర్స్‌తో అంతులేని డిస్కషన్‌లో ఉన్నారు. వాళ్ల ఫీల్డాఫీసరు గారు పక్కసీట్లో సోఫాలో వివరాల దస్త్రంలో గురువుగారి ప్రథమ శిష్యుడంత వినయంగా ఆనందంగా తయారుగా ఉన్నాడు.

"క్షమించాలి సార్! మీరు చాలా ముఖ్యమైన మీటింగులో వున్నారు .కానీ డిస్టర్బ్ చేయక తప్పట్లేదు. నా కంగారులో నేనే మైనా ఎక్కవ మాట్లాడితే తప్పట్టుకోకండి!"

"లక్ష కడితేగానీ గారంటీ ఇవ్వడం కుదరదన్నారట! మామూలుగా మమ్మల్నెపుడూ డిపార్ట్‌మెంటు వాళ్లు గారంటీ ఇమ్మని అడగలేదు. కానీ ఈసారి మా అదృష్టమో, దురదృష్టమో! ఆర్డరు విలువ మా తాహతుకి మించిందనీ వాళ్లు భావిస్తున్నారు. గారంటీ ఇవ్వకపోతే, అందరం ఇబ్బందిలో పడిపోతాం. ఇదుగో టెలిగ్రాం చూడండి. టెలిగ్రాం చూశాక ఆయన మొఖంలో కాస్త చలనం కనిపించింది. "ఔను! మరి ఈ ఆర్డరు మిస్స యితే వాళ్లు మునిగేది ఖాయం!" నాకైతే పెద్ద తేడా పడదు.

"డాక్టరుగారూ, మీరు మాత్రం మాకెప్పటికప్పుడు అగ్ని పరీక్షలు పెట్టేస్తారు. మా రూల్సు మాకుంటా యని మిమ్మల్ని ఇన్నేళ్లుగా నమ్మించలేక పోయాం. లిమిట్ శాంక్షన్ కాకుండా మీకు గారంటీ ఇవ్వలేం. కాకపోతే, ఒక విధంగా చేద్దాం. మీ సి.సి. ఎకౌంట్‌లో లక్ష విత్‌డ్రాయల్ ఎక్సస్ చేసి అది డిపాజిట్‌గా తీసుకుని దానిమీద మీకు గారంటీ ఇస్తాం!"

"మీకు నా మీదున్న నమ్మకానికి జోహార్లు సార్. ఇదే నేనే బంగ్లాదేశ్‌లోనో రెండేళ్లుండి ఎన్.ఆర్.ఐ.గా వస్తే 5వేలు కడితేనే గారంటీ ఇచ్చుండేవాళ్లు. మళ్లీ నా ఎకౌంట్ రెగ్యులర్‌గా లేదనకండి."

"లిమిట్ శాంక్షన్ అయ్యాక మీ ఎకౌంట్‌లో రివర్సు చేస్తాం లెండి మేడం. ఒక్కటి మాత్రం ఒప్పకుని తీరాలి. మా బ్యాంకు వాళ్లు నేనడిగినవేవీ ఇవ్వరు కానీ, నా వయసు చూసి జాలో, నా చదువు చూసి గౌరవమో, నోరు చూసి భయమో గానీ, చాలా మర్యాదగా ప్రవర్తిస్తారు."

"సర్లెండి. ఏదో చచ్చినవాడి పెళ్లికి వచ్చిందే కట్నం. సార్! మరి నా ప్రపోజలు..."

"అదెపుడో పంపేశాంగా!"

"నిన్నడిగితే తయారౌతోందని అన్నారు".

"అంటే, ఎప్పుడో అంటే పొద్దున డాక్‌లో వెళ్లింది. మీరక్కడ ప్రయత్నం చేసుకోండి. మీకు అందరూ

బాగా తెలుసుగదా!"

"ముంచాడు కొంప. అంటే ఈయన సరిగ్గా రాయలేదన్న ట్లేగా!"

"రికమెండ్ చేశారా సార్? అక్కడ ఎవర్ని కలవాలి?"

"ఎటూ వెడుతున్నారుగా! మీకే తెలుస్తుంది.అక్కడ మన బ్రాంచి పనులన్నీ విష్ణుశర్మగారు చూస్తుంటారు!"

సరేనని బయల్దేరా. అదేమిటి? వెడితే తెలుస్తుందంటారు. కొంపదీసి రికమెండ్ చెయ్యలేదా ఏమిటి? అలాటపుడు ఈ హెడ్డాఫీసుకి పంపే డ్రామా దేనికి. బహుశా నేను మళ్ళీ ఏ బ్రహ్మదేవుడి కాళ్లో పట్టుకుని అజ కనుక్కోమంటే, వీళ్లకి మాట రాకుండా ఉండటానికి కాబోలు. పిక్నిక్కుల్లో అందరం గుండ్రంగా కూచుని బంతి పాస్ చేస్తామే, అలాగన్నమాట. మ్యూజిక్ ఆగేప్పటికి ఎవరిచేతిలో బంతుంటే వాళ్లే దొంగ.

ఈ బ్యాంకు వాళ్లు మమ్మల్ని నమ్ముకొని ఇంత డబ్బిచ్చారు కదా. ఎలా రాబట్టుకోవాలీ అన్న ఆలోచనే ఉండదా, ఏమిటి? పిడుక్కీ, బియ్యానికీ ఒకటే రూలు.

అంతగా రూల్సు అడ్డం రావడానికి వీలవకపోతే, వీళ్లకి పవర్సుండవు. నెలకి 30వేలు జీతం పుచ్చుకున్న మేనేజరుగారికి, పాతికేళ్లనుంచీ వీళ్లతోనే ఎకౌంటున్న యూనిట్‌కి గారంటీ ఇవ్వడానికి పవర్సు లేవంటే నమ్మేందుకు నేనేమన్నా చిన్న పిల్లనా? వీళ్ల సర్వీసు కన్నా నా ఎకౌంటు వయస్సే ఎక్కువ. ఈ మేనేజర్ల కేముంది. వస్తూంటారు. పోతూంటారు. కలకాలం ఉడాల్సింది మా యూనిట్సూ, మళ్లీ సదా మా సేవలో బ్యాంకూనూ. ఉన్నదున్నట్లు అడుగుతానని అందరికీ నా మీద కోపమే. మా కష్టార్జితం వడ్డీ రూపంలో పుచ్చుకుని వీళ్లే ఇంత షోకు వెలగబెడితే, ఇంక మాకెంత ఉండాలి? ఏమిటో ప్రపంచం అంతా తలకిందులుగా నడుస్తుందని బ్రహ్మంగారేనాడో చెప్పారు!

గడచిన నాలుగేళ్లూ మా యూనిట్ మూసెయ్యకుండా ప్రాణాలతో నిలబెట్టడానికి లిటరల్‌గా అష్టకష్టాలు పడ్డాను. ఈత రాకుండా చెరువులో దూకినట్లు, ఏ ప్రిపరేషనూ లేకుండా సడెన్‌గా లిబరలైజేషను అమలులో కొచ్చేసి జనాలంతా హైటెక్, హై క్వాలిటీ, ఎక్స్‌పోర్ట్, డ్యూటీ ఫ్రీ ఇంపోర్ట్, ఐ.ఎస్.ఒ.9000లు, ఇంటర్నేషనల్ మార్కెట్స్ టెక్నాలజీ అప్‌గ్రేడేషన్ - అని కల్లుతాగిన కోతుల్లా గెంతడంతో మాకు పెద్ద దెబ్బ తగిలింది. ఆ అటుపోట్లన్నీ తట్టుకునేప్పటికి యూనిట్టూ, నేనూ, మా ఉత్సాహం తప్ప ఏం మిగల్లేదు. మళ్లీ నిరుటినించి నార్మల్‌కి వచ్చి పనిచేసుకుందామనుకుంటే డబ్బులు చాలట్లేదు. అప్లికేషన్ పెట్టి 8నెలలయ్యాక ఇదిగో ఇప్పుడు రికమెండ్ చేసో, చెయ్యకో పైకి పంపార్ట.

పైకంటే, నిజంగా పైకే సుమా!

మా ఫైలు చూసే విష్ణుశర్మగారు ఆ లక్ష్మీ నిలయంలో ఆరో అంతస్థులో ఉంటారట. భారతదేశపు లక్ష్మీ నిలయం కళకళ్లాడిపోతోంది. అక్కడ పనిచేసే వాచ్‌మేన్ మొదలుకొని పెద్ద మేనేజర్ దాకా అంతా మేం దేవదూతలం! అన్నంత హుందాగా, ధైర్యంగా తిరుగుతున్నారు. చీకూచింతా లేనట్లుండే వాళ్లని చూస్తే ఒక్క క్షణం నాకెంతో అసూయ అనిపించింది. ఎప్పుడూ ఏ.సి.గదుల్లో ఉంటారేమో! అందరూ మంచి నీటుగా స్టైలుగా ఉన్నారు. చివరికి వాళ్ల కార్లు కూడా వర్క్‌టురూల్‌లా పొద్దున్నే రావటం, సాయంత్రం ఇంటి కెళ్లడం వల్ల తళతళలాడుతూన్నాయి. పాపం, మా పిచ్చి కార్లలాగా వర్క్‌షాపులకీ, స్టోరులకీ, అఫ్జల్‌గంజికీ, ట్రాన్స్‌పోర్టు ఆఫీసులకీ, పటంచెర్వు నుంచి కుషాయిగూడాకీ పరుగులు తియ్యవుగా? నెమ్మదిగా ధైర్యం తెచ్చుకుని ఆ లక్ష్మీ నిలయం ఆరో అంతస్థులో అడుగుపెట్టా లిఫ్టు సాయంతో. ఆ లిఫ్టు కూడా బిల్డింగ్‌కు తగ్గట్టు విశాలంగా ఒక గుమాస్తా, ఇద్దరు పిల్లలతో నివసించడానికి సరిపడే ఠికానా అంత ఉంది. లిఫ్టులోంచి హాలులోకి వెళ్లేప్పటికి చల్లగాలికి ప్రాణం లేచివచ్చింది.

ఆ హాలులో ఉన్న ఆఫీసర్లంతా చాలా సీనియర్లలాగా, రేపో మాపో అన్నట్టున్నారు. అంటే, ఆరో అంతస్థులో హాలులో సీటు దొరకాలన్నా, తల నెరవాలన్నమాట. అటు ఇటు తిరిగే ఒకళ్లిద్దరు తప్పించి అలికిడేం లేదు. అంతా చాలా స్థిమితంగా, నిశ్చింతగా, నిర్వికార సమాధిలో ఉన్న ట్లుగా ఫైల్స్ తిరగేస్తున్నారు. వీళ్ళందరికీ అడిగిన దాంట్లో సగం అప్పిచ్చి తలా ఒక చిన్న యూనిట్టు పెట్టించేస్తే ఎంత మజాగా ఉంటుందో?

ఛ! తప్పు కదూ. ముఖ్యమైన పనిమీద వచ్చి ఇలాటి వికటపు ఆలోచనలు చేయవచ్చునా? చాలా అయోమయంగా, నిస్సహాయంగా చూస్తూ నెమ్మదిగా అడిగా "సార్! విష్ణుశర్మగారెక్కడుంటారు?"

"నేరుగా వెళ్లి లెఫ్ట్‌కి తిరిగితే కార్నర్ సీటమ్మా!"

"నమస్కారం సార్. ఇందాక మీతో ఫోన్లో మాట్లాడా."

"కూచోండి. మీ వర్కింగ్ కాపిటల్ ఎన్‌హాన్స్‌మెంట్ గూర్చి కదా! కానీ మీ ప్రపోజలు వచ్చినట్లు లేదే?"

"పంపామన్నారండీ. కనుక్కునే వచ్చా.! ఇంకెవరిదగ్గరైనా ఉందేమో?"

"మూర్తిగారూ! బ్రాంచి నుంచి మనకి వీరి ప్రపోజలేమైనా వచ్చిందా?"

"వచ్చింది సార్! కానీ... అమ్మా! మీ యూనిట్ కొన్నాళ్లు ఎన్.పి.ఎ. గా ఉందా?"

"అంటే .."

"నాన్ పెర్ఫామింగ్ ఎసెట్"

"అంటే..."

"అంటే, బ్యాంకులో డిపాజిట్లుగానీ, విత్‌డ్రాయల్స్ గానీ ఏవీ లేకుండా ట్రాన్సాక్షన్సేవీ లేకుండా పోవడం అన్నమాట." మీ యునిట్టేమైనా కొన్నాళ్లు సిక్ ఐందా?"

"కొంత సిక్కేమిటి సార్! ఆల్‌మోస్ట్ చచ్చి బతికాం. మా చావు మేం చస్తూంటే ఎకౌంటు లో డిపాజిట్లు ఎలా ఉంటాయండి? విత్‌డ్రాయల్ మీరొప్పుకుంటే ట్రాన్సాక్షన్సుండేవి మరి. కానీ, మాకంత ఆపద వచ్చినా కూడా మీ బ్యాంకు ఒక్క రూపాయి కూడా సాయం చేయలేదండీ!"

"మీరడిగారా?"

"అంటే, అప్పట్లో చాలా ప్రాబ్లెమ్సుండటంతో బ్యాంకుని అప్పుడిగి తిరగడానికి వీలుపడలేదండీ! ఆ తిరగడంలో నాకున్న ధైర్యంపోయి మంచం పట్టేస్తానేమోనని భయం వేసి, మా ఊళ్లో మాకున్న ఎనిమిది కరాలూ, ఇక్కడొక ప్లాటూ అమ్మేసి, 2 సంవత్సరాలు యూనిట్ నడిపామండీ.భగవంతుడి దయవల్ల ఇప్పుడా సమస్యలన్నీ తీరి మంచి ఆర్డర్లున్నాయండీ! ఇప్పుడు కొత్త డిస్ట్రిబ్యూటర్ దొరికి మాకు మళ్లీ మంచిరోజు లొచ్చాయి కదా. మీరడిగే ప్రశ్నలకి సమాధానాలు చెప్పగల్గుతామనుకుని లోను కప్లై చేశాను. సుమారు 8నెలలనించీ అడుగుతున్నాం. ఈవేళ మేనేజర్‌గారిని కలిస్తే మీకు పంపామని చెప్పారు!"

"పంపారు కానీ, పెద్దగా రికమెండ్ చేయలేదమ్మా. గడిచిన మూడేళ్లుగా మీ పెర్ఫామెన్స్ బాగుండలేదని రాస్తున్నారు. ఏదైనా ఎడిషనల్ కొల్లేటరల్ సెక్యూరిటీ ఇస్తే ఇవ్వొచ్చని రాశారు. డెసిషన్ మాకు వదిలి పెట్టారు!"

"ఏదో సామెత చెప్పినట్లు! పెళ్లి ఐతే గానీ పిచ్చి కుదరదు. పిచ్చి కుదిరితేగానీ పెళ్లవదు అన్నట్లుంది. నేను ఐదు పేజీల అప్లికేషన్లోనే సవివరంగా మా యూనిట్ ఎదుర్కొన్న పరిస్తితులన్నీ రాశా. మేం రాసిన కారణాలే మాకు చూపిస్తే ఎలా సార్? కొల్లేటరల్ అడుగుతారు , అన్నీ ఆక్షను చేసి రాబట్టుకోవాలనేదే మీ రూలా సార్ యాభై లక్షలు ఖరీదు చేసే మా బిల్డింగు మీ తనఖాలోనే వుంటే ఒక్క ఐదు లక్షలడిగితే ఇంకొక ఆస్థి ఎక్కడినుంచి తేగలం?"

"మా రూల్సలా వున్నాయి! పదిలక్షల లోనుకి మీరు యాభై లక్షల టర్నోవరు చేయాలి .కానీ నిరుడు మార్చి నాటికి 35 కూడా దాటలేదు."

"మీ బ్యాంకు వాళ్ళు గైడ్‌లైన్స్ అన్నిటికీ విపరీత భాష్యాలు చెప్తారండీ. చేసే టర్నోవరుకి కనీసం 20 శాతం బ్యాంకు ఇవ్వాలని అన్నారుగానీ, మీ రూల్ లాగా అనలేదే? ప్రోడక్టుని బట్టీ, ఇచ్చే క్రెడిట్‌ని బట్టీ ,సీజన్‌ని బట్టీ డబ్బు పెట్టుబడి పెట్టాలి గాని, పర్సంటేజీ ప్రకారం బిజినెస్ ఎలా అవుతుంది సార్! అందులోనూ మాలాంటి చిన్న వాళ్ళకి బజార్లో క్రెడిట్ దొరకదు. ఆర్నెల్ల లోపు పేమెంట్ రాదు. ఐదింతలు

టర్నోవరు ఏ సొమ్ము తెచ్చి చెయ్యాలి? అయినా ఈసారి మాకు మొదటి ఆరు నెలలకే నలభై లక్షలయింది కదా!"

"కానీ మేమెప్పుడూ గడిచిన మూడేళ్ల ఏవరేజ్ తీసుకుంటాం గదా!"

"ఒక గ్రాఫ్ ప్రకారం పెరగడానికి మావేవీ పెద్ద యూనిట్లు కావు కదండీ! ఈ ఏడాది బాగుంది కదా! అని మళ్లీ అలా ఉంటుందనీ చెప్పలేం. ఇప్పుడు బాలేకపోతే రేపు బాగుండదనీ చెప్పలేం. ఎప్పటి కథ అప్పుడే! ఈ మూడేళ్ళ లెక్క ఏమిటి? మేం మీ బ్యాంకులో 25ఏళ్ళనించీ ఉన్నాం కదా! ఆ లెఖ్ఖ ఎందుకు తీసుకోరూ?"

"మీ బ్రాంచి రికమెండ్ చేసుంటే,మేం తప్పక మీకు సహాయం చేసుండేవాళ్లం!"

"మరి మీకెందుకు పంపినట్లు?"

"అంటే సెక్యూరిటీ క్లాజు మేమేమైనా తగ్గిస్తామని ఐ ఉండవచ్చు. కానీ, బ్రాంచి అలా రాశాక మాకు అంత డిస్క్రిషను లేదు. ఈ ఏడాదిలా జరగనీయండి. మళ్లీ సంవత్సరం చూద్దాం!"

"పోనీలెండి సార్! మీరంత పవర్‌లెస్ ఐతే ఏం చేస్తాం. అత్తగారనేదిట. వచ్చే ఏడాది వబ్బట్లు వండి పెడతా నని! అలా ఉంది."

ఇంతలోకే, ఒకాయన హడావిడిగా పెద్ద బాదాం హల్వా పాకెట్ ఓపెన్ చేసి అన్ని టేబిల్స్ దగ్గరా హల్వా పంచుతున్నాడు. ఎదురుగా ఉన్నా కదా! అని నాకూ ఓ పీస్ ఇచ్చాడు.

"ఏవిటి సెలబ్రేషన్ సార్?"

విష్ణుశర్మగారు మహదానందంగా చెప్పారు. "వీరు, ఎన్.ఆర్.ఐ. అమ్మా! పటాంచెర్వులో 5 కోట్ల పెట్టుబడి తో పెద్ద ఫ్యాక్టరీ పెడుతున్నారు. మనదేశంలో మొట్టమొదటిసారి ఆ మందు తయారు చేస్తారు. అంతా ఎక్స్‌పోర్ట్సే! వీరు గడిచిన 20 సంవత్సరాల నుంచీ అమెరికాలో పెద్ద కంపెనీలో పనిచేసి వచ్చారు. మొత్తం మన బ్యాంకే ఫైనాన్స్ చేసింది. ఆర్నెల్లలో ప్రొడక్షన్‌కి వెడతారు."

"చాలా సంతోషం సార్. ఆల్ ద బెస్ట్."

వస్తూ అనుకున్నా - "ప్రోడక్ట్ కొత్తది. యూనిట్ కొత్తది. ఎంట్రప్రెన్యూయర్‌కి బిజినెస్ కొత్త. దేశం కొత్త. ఐనా, ఐదు కోట్లు ఆనందంగా ఇచ్చారు. మరి ఆయన 15కోట్ల కొల్లేటరల్ ఇచ్చాడా? మరి మా కేసు? ప్రొడక్టు పాతది. మార్కెట్ పాతది. బ్యాంకు పాతది. ఎంట్రప్రెన్యురు పాతది. అంతా పాతదే. ఐనా ఐదు పైసలివ్వరు." మరి, "బాదంహల్వా అంటే మాటలా!"